గజగజ వణికిస్తున్న చలి పులి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు రాత్రి ఉష్ణోగ్రతలు

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో రికార్డు స్థాయిలో 8.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు • తూర్పు, ఈశాన్య గాలులతో పెరిగిన చలి తీవ్రత

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో చలి పంజా విసురుతోంది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నదని చెబుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. సిర్పూర్(యూ)లో రికార్డు స్థాయిలో 8.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 8.8, ఆదిలాబాద్ జిల్లా బేలలో 9.9 డిగ్రీలు నమోదైంది. జోగులాంబ గద్వాలలో 15.1, సూర్యాపేటలో 15.6, వనపర్తిలో 15.9 డిగ్రీలుగా నమోదైంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తుండటమే చలి తీవ్రత పెరగటానికి కారణమని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడ్రోజులు చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన 27 జిల్లాల్లో 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్‌లో ఉష్ణోగ్రతలు తక్కువ స్థాయికి పడిపోతుంటాయి. ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో నవంబర్‌లోనే చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. పదేళ్లతో పోల్చితే ఈ నెల 23న రాత్రి నాలుగు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో చలిమంట కాగుతున్న స్థానికులు

శబరిమలకు 44 ప్రత్యేక రైళ్లు

- **విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి కొల్లంకు రాకపోకలు**

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి కొల్లంకు 44 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ప్రకటించింది. భక్తుల రద్దీ దృష్ట్యా డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ఈ రైళ్లు నడవనున్నట్టు తెలిపింది. వీటిలో 2ఏసీ, 3ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నది. విశాఖ నుంచి వెళ్లే రైళ్లు దువ్వాడ నుంచి కంయంకుళం వరకు 26, శ్రీకాకుళం నుంచి వెళ్లే రైళ్లు పొందూరు నుంచి 32 స్టేషన్లలో ఆగుతాయని వెల్లడించింది. శబరిమల వెళ్లే భక్తులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

రవాణాశాఖలో పదోన్నతులు

- **జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లుగా మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, శివలింగయ్య**

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తేతెలంగాణ): రవాణాశాఖలో ఖాళీగా ఉన్న డీటీసీ, జేటీసీ పదోన్నతులకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ నేతృత్వంలోని డిపార్టమెంటల్ ప్రమోషన్ కమిటీ ఆమోదం తెలిపింది. రంగారెడ్డి డీటీసీ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, మహబూబ్‌నగర్ డీటీసీ శివ లింగయ్యకు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లుగా పదోన్నతి కల్పించారు. ఉప్పల్ ఆర్టీవో వాణి, ఖమ్మం ఆర్టీవో ఆఫ్రిన్, మెహదీపట్నం ఆర్టీవో కిషన్, కొత్తగూడెం ఆర్టీవో సదానందం, నాగోల్ ఆర్టీవో రవీందర్ కుమార్‌గౌడ్, సూర్యాపేట ఆర్టీవో సురేష్‌రెడ్డికి డీటీసీలుగా పదోన్నతులు కల్పిస్తూ డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ ఆమోదం తెలిపింది. పదోన్నతులకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. పదోన్నతులకు ఆమోదం తెలపడంపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, రవాణా శాఖ కమిషనర్‌కు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్నాచౌక్‌లో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న ఆటో యూనియన్ జేఏసీ నాయకులు

ఏం సాధించారని విజయోత్సవాలు

- **ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు**
- **ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీ ఏమైంది?**
- **ధర్నాచౌక్ వద్ద ధర్నాలో ఆటో యూనియన్ నేతలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఆటో డ్రైవర్లు చస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సవం జరుపుకుంటున్నదని రాష్ట్ర ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారని, కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్లు బిక్షం ఎత్తుకొని బతకాల్సిన దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. డ్రైవర్ల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి చోద్యం చూస్తున్నదని విమర్శించారు. ఆటో డ్రైవర్లతో డిసెంబర్‌లో చర్చలు జరపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం మహా ధర్నా జరిగింది. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు రవిశంకర్, సమ్మయ్య యాదవ్‌లు మాట్లాడుతూ.. కేంద్రం పెంచిన రవాణా వాహనాల ఇన్సూరెన్స్ 50 శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. నగరంలోకి గూడ్స్ వాహనాల అనుమతి సమయం పెంచాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వం.. ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, జహంగీర్, జేబీఎస్ శ్రీనివాస్, యన్ కిషన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 6 వేల ఈవీ చార్జింగ్ స్టేషన్లు!

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా 6వేల ఎల్క్ట్రిక్ వాహన చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ దిశగా తెలంగాణ రెడ్‌కో కసరత్తు వేగవంతం చేసింది. విద్యుత్తు వాహనాల వాడకం పెరుగుతున్న నేపథ్యంలో చార్జింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచడం అనివార్యమైంది. మరోవైపు ఈవీ చార్జింగ్ స్టేషన్ల నుంచి ఇదివరకు వసూలు చేసే ఫిక్స్‌డ్ చార్జీలను ఇటీవలే మినహాయించారు.

సొసైటీలకు భూకేటాయింపులు రద్దు

- **న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక విభాగం కాదు**
- **అక్రెడిటెడ్ జర్నలిస్టులు కూడా ప్రత్యేక విభాగం పరిధిలోకి రారు**
- **ఆర్టికల్ 14ను ఉల్లంఘించేలా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు**
- **సుప్రీంకోర్టు సంచలన తీర్పు**

న్యూఢిల్లీ, నవంబర్ 25: దశాబ్దాలుగా ఇండ్ల స్థలాల కోసం వేచి చూస్తున్న హైదరాబాద్‌లోని పాత్రికేయుల ఆశలపై సుప్రీంకోర్టు నీళ్లు చల్లింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్లు, న్యాయమూర్తులు, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సోమవారం కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం ఈ మేరకు 64 పేజీలతో తుది తీర్పును వెలువరించింది. భూముల కేటాయింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు ఏకపక్షంగా, అహేతుకంగా, వివక్షాపూరితంగా ఉన్నాయని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)ను ఉల్లంఘించడమేనని స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు డిస్కౌంట్ ధరల్లో స్థలాల కేటాయింపునకు వారిని ప్రత్యేక క్యాటగిరీగా పరిగణించలేమని పేర్కొంది. ఈ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005లో, 2008లో జారీచేసిన జీవోలను కొట్టివేస్తున్నట్టు తెలిపింది. ఈ తీర్పుతో హౌసింగ్ సొసైటీలు, వాటి సభ్యులతో ప్రభుత్వం చేసుకున్న లీజు ఒప్పందాలు కూడా రద్దయినట్టేనని ప్రకటించింది. సొసైటీలు, వాటి సభ్యులు చెల్లించిన రిజిస్ట్రేషన్ చార్జీలను, స్టాంప్ డ్యూటీలను, ఇతర ఖర్చులను వడ్డీతో సహా ప్రభుత్వం తిరిగి చెల్లించాలని తీర్పు చెప్పింది. సొసైటీల ఖాతాలో పేర్కొన్న డెవలప్‌మెంట్ చార్జీలను ఇన్‌కం ట్యాక్స్ విభాగం ధ్రువీకరణతో వడ్డీతో సహా చెల్లించాలని పేర్కొంది. రిజర్వు బ్యాంకు నిర్దేశించిన మేరకు వడ్డీ చెల్లించాలని స్పష్టంచేసింది. ఆయా సొసైటీలకు కేటాయించిన సదరు భూమిని భవిష్యత్తులో ఎవరికి కేటాయించాలన్నది తెలంగాణ ప్రభుత్వం విచక్షణకే వదిలివేస్తున్నామని, అయితే ఆ కేటాయింపులు చట్టబద్ధంగా, సమానత్వ, న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఉండాలని వివరించింది. అక్రెడిటెడ్ జర్నలిస్టులకు ప్రత్యేక ప్రాధాన్యం పొందడానికి వారిని సమాజంలో ఓ ప్రత్యేక విభాగంగా పరిగణించలేమని అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వ విధానం సమానత్వ, న్యాయ ప్రమాణాలకు అనుగుణంగా లేదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు లోబడి స్థలాల కేటాయింపు జరిగి ఉంటే సహేతుకంగా ఉండేదని స్పష్టంచేసింది. సమాజంలోని అణగారిన, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలతో పోలిస్తే న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మెరుగైన స్థితిలోనే ఉన్నారని వ్యాఖ్యానించింది.

ప్రభుత్వ వైఫల్యమే: టీయూడబ్ల్యూజేఎఫ్

ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్యం, తప్పుడు విధానాల కారణంగానే ఇలాంటి పరిణామాలు ఎదురవుతాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవపున్నయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా న్యాయ నిపుణులను సంప్రదించి భవిష్యత్తులో ఇటువంటి అడ్డంకులు రాకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం: టీయూడబ్ల్యూజే

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అత్యంత విచారకరమని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కే రాంనారాయణ, ఉప ప్రధానకార్యదర్శి కే రాములు పేర్కొన్నారు. జర్నలిస్టుల దీనమైన జీవన పరిస్థితులను మానవీయకోణంలో అర్థం చేసుకొని, గతంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి అనుకూలంగా తీర్పునిస్తే, దానిని కొట్టివేసి తీర్పు ఇవ్వడం దురదృష్టకరమని విచారం వ్యక్తంచేశారు. ఈ తీర్పు దాదాపు వెయ్యి జర్నలిస్టు కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్నదని తెలిపారు. ఏండ్ల తరబడి ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న వేల మంది ఆయా సొసైటీల జర్నలిస్టులను నిరుత్సాహానికి గురిచేస్తుందని పేర్కొన్నారు. ఇండ్ల స్థలాల కేటాయింపు విషయంలో ఆయా సొసైటీల బాధ్యులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి జర్నలిస్టులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

మహిళా సంఘాల వాటా వెయ్యి మెగావాట్లే

- **సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించిన టీజీ రెడ్‌కో**

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): సోలార్‌ప్లాంట్ల ఏర్పాటులో మహిళా సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్న నిర్ణయం తీసుకున్న సర్కారు వెయ్యి మెగావాట్లను మాత్రమే మహిళా సంఘాలకు కేటాయించింది. పీఎం కుసుమ్ స్కీంలో కాంపోనెంట్-ఏలో భాగంగా నాలుగు వేల సోలార్ విద్యుత్తు ఉత్పత్తికి ఇటీవలే ఇంధనశాఖ అనుమతి ఇచ్చింది. అయితే నాలుగు వేల మెగావాట్లల్లో వెయ్యి మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు బాధ్యతలను స్వశక్తి సంఘాలకు అప్పగించారు. ఇలా వెయ్యి గ్రూపులకు ఈ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునే అవకాశముంది. మిగతా మూడు వేల మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు బాధ్యతను రైతులకు అప్పగిస్తారు. ఇందుకు టీజీ రెడ్‌కో టెండర్లు ఆహ్వానించింది. ఆసక్తి గల వారు డిసెంబర్ 10లోపు టెండర్లు దాఖలు చేయవచ్చు. టెండర్ దక్కించుకున్న సంస్థ ప్లాంట్ల డిజైన్, సామగ్రి సరఫరా, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్, ఏడాదిపాటు నిర్వహణను చేపట్టాల్సి ఉంటుందని టీజీ రెడ్‌కో వీసీ అండ్ ఎండీ వావిల్ల అనిల తెలిపారు.

జేఎల్ ఎకనామిక్స్ ఫలితాల విడుదల

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీలో భాగంగా జేఎల్ ఎకనామిక్స్ ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఎకనామిక్స్, ఎకనామిక్స్(ఉర్దూ మీడియం) పోస్టులకు ఎంపికైన వారి ఫలితాలను ప్రకటించింది. వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఇంటర్ ప్రథమ, ద్వితీయ రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థుల పరీక్ష ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఈనెల 27 వరకు గడువు ఉండగా, డిసెంబర్ 3వరకు పొడిగించినట్టు బోర్డు కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 జరిమానాతో డిసెంబర్ 12, రూ.500 జరిమానాతో డిసెంబర్ 17, రూ. వెయ్యి జరిమానాతో డిసెంబర్ 24, రూ.2వేల జరిమానాతో జనవరి 1 వరకు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

గ్రూప్-2 పరీక్షలు వాయిదావేయండి

- **ఆర్ఆర్‌బీ పరీక్షల నేపథ్యంలో వాయిదాకు డిమాండ్**
- **డిసెంబర్ చివరలో పరీక్షలు నిర్వహించాలని వినతి**
- **టీజీపీఎస్సీ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పించిన నిరుద్యోగులు**

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఆర్ఆర్‌బీ పరీక్షల నేపథ్యంలో గ్రూప్-2 పరీక్షలను వాయిదావేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఒకే సమయంలో రెండు పరీక్షలుండటంతో ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో గ్రూప్-2 పరీక్షలను డిసెంబర్ 15, 16న నిర్వహించనున్నారు. డిసెంబర్ 16న ఆర్ఆర్‌బీ జూనియర్ ఇంజినీర్ పరీక్షను నిర్వహించనున్నారు. ఒకే రోజు రెండు పరీక్షలుండటంతో, రెండింటికి దరఖాస్తు చేసుకున్నవారికి నష్టం కలగనుంది. దీంతో గ్రూప్-2 పరీక్షను వాయిదావేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. నిరుద్యోగులు సోమవారం టీజీపీఎస్సీ చైర్మన్ డాక్టర్ ఎం మహేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్ఆర్‌బీ పరీక్షను జాతీయంగా నిర్వహించనున్నడటంతో, రాష్ట్రప్రభుత్వం గ్రూప్-2ను వాయిదావేయాలని వినతిపత్రంలో కోరారు.

రెండింటికి హాజరయ్యే అవకాశమివ్వండి

రెండు పరీక్షలను ఒకే రోజు నిర్వహించనుండటంతో రెండింటిని రాసేవారు ఏదో పరీక్షను వదులుకోవాల్సి వస్తున్నది. రెండు పరీక్షలకున్న ప్రాముఖ్యాన్ని గుర్తించి, నిరుద్యోగ యువతకు రెండు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించాలని కోరుతున్నాం. ఆర్ఆర్‌బీ పరీక్షలు ముగిసిన వెంటనే గ్రూప్-2 పరీక్షలను నిర్వహించినా అభ్యంతరం లేదు. మానవతా కోణంలో ఆలోచించి ఒక అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. **- జీ గౌతమి, అభ్యర్థి**

డిసెంబర్ చివరలో నిర్వహించండి

గ్రూప్-2 పరీక్షలను నెలలకొద్ది వాయిదావేయాలని కోరడంలేదు. ఆర్ఆర్‌బీ పరీక్షలుండటంతో రెండు, మూడు వారాలు మాత్రమే వాయిదా వేయమంటున్నాం. డిసెంబర్ చివరలో పరీక్షలు నిర్వహిస్తే ఇబ్బందులుండవు. ఇప్పటికే హడావుడిలో గ్రూప్-1 పరీక్షలను అభ్యర్థులు సజావుగా రాయలేకపోయారు. గ్రూప్-2 పరీక్షలపై చివరి వరకు లాగకుండా, త్వరగా నిర్ణయం తీసుకుంటే అభ్యర్థులకు ఉపశమనం కలుగుతుంది. **- జనార్దన్, నిరుద్యోగ జేఏసీ నేత**

విద్యార్థిని స్వాతి

విద్యార్థిని కిడ్నాప్

- **బైక్‌పై ఎత్తుకెళ్లిన దుండగులు**

తాండూరు రూరల్, నవంబర్ 25: బైక్ పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఓ విద్యార్థిని కిడ్నాప్ చేసిన ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం కరణ్‌కోట పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు మండలం, కరణ్‌కోటకు చెందిన స్వాతి(9) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నది. 22న సాయంత్రం కిరాణ దుకాణంలో ఉప్పు ప్యాకెట్ తీసుకురావడానికి వెళ్లింది. ఆ సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్ పై వచ్చి బాలికను కిడ్నాప్ చేసినట్టు అదే గ్రామానికి చెందిన సామెల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై విఠల్‌రెడ్డి కరణ్‌కోటలోని సీసీ కెమెరాలతోపాటు చుట్టూ పక్కల బాలిక ఆచూకీ కోసం గాలించారు. బాలిక అమ్మమ్మ బక్కలాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై తెలిపారు.

90 వేల పనికి 45 వేల లంచం డిమాండ్

- **ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఏఈ**

పెద్దపల్లి, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): 90 వేల విలువ గల పనికి 45 వేల లంచం డిమాండ్ చేసిన పెద్దపల్లి జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ ఏఈ సోమవారం ఏసీబీకి చిక్కాడు. వానకాలంలో వచ్చిన వరదలతో జూలపల్లి మండల కాచాపూర్ సమీపంలోని డీ-83 ప్రధాన కాలువపై రైట్ సైడ్ బండ్‌కు దిగువన బ్రిడ్జికి బుంగ పడింది. ఈ పని పూర్తి చేసేందుకు ఇరిగేషన్ శాఖ రూ.91,703కు టెండర్లను పిలిచింది. ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన తమ్మడబోయిన శ్రీనివాస్ టెండర్ దక్కించుకుని పని పూర్తిచేశాడు. బిల్లు కోసం ఇరిగేషన్ కార్యాలయం చుట్టూ తిరగడం ప్రారంభించాడు. ఎంబీ రికార్డ్ చేయాల్సిన ఏఈ ఓంకారం నర్సింగరావు పని విలువలో సగం రూ.45 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చివరకు రూ.20 వేలు ఇవ్వడానికి ఏఈతో ఒప్పందం కుదిరింది. సోమవారం ఉదయం రూ.20 వేలతో పెద్దపల్లికి చేరుకున్న కాంట్రాక్టర్ ఆ తరువాత ఏఈకి ఫోన్ చేశాడు. కలెక్టరేట్ కమాన్‌కు ఎదురుగా ఉన్న టీ స్టాల్ వద్దకు రావాలని సూచించగా, అక్కడి వెళ్లి డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఏఈ నర్సింగరావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి ఏఈని అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ బీవీ రమణమూర్తి తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఏఈ నర్సింగరావు

ఆర్ఎస్ఎస్ లక్ష్యాన్ని నెరవేరుస్తున్న కాంగ్రెస్

- **కార్పొరేట్ల లాభాల పల్లకీని మోస్తున్న సీఎం రేవంత్**
- **ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్**
- **రాష్ట్ర మావోయిస్టు పార్టీ బహిరంగ లేఖ**

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరెస్సెస్, బీజేపీల లక్ష్యాన్ని పరిపూర్తి చేయడానికి కంకణం కట్టుకున్నదని, సామ్రాజ్యవాదుల, దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య, కార్పొరేట్ల లాభాల పల్లకిని భుజానికెత్తుకొని మోస్తున్నదని మావోయిస్టుపార్టీ రాష్ట్ర కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. డిసెంబర్ 2 నాటికి 'ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం' (పీఎల్జీఏ)కి 24 ఏండ్లు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ అధికార ప్రతినిధిత జగన్ సోమవారం ఓ బహిరంగ లేఖ విడుదల చేశారు. రాష్ట్రాన్ని కార్పొరేట్లకు కట్టపెట్టడానికి ఆర్థిక అభివృద్ధి పేరుతో సులభతర వాణిజ్య విధానం అమలు చేస్తూ విస్తృతంగా పెట్టుబడులను ఆహ్వానిస్తున్నదని జగన్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణ, అడవులు, భూముల కార్పొరేటీకరణ, వ్యవసాయ, సేవా, పారిశ్రామిక రంగాల కార్పొరేటీకరణ.. ఇలా సర్వం దేశ, విదేశీ దోపిడీ వర్గాలకు అప్పగిస్తున్నదని మండిపడ్డారు.

ప్రజల హామీలు తుంగలో తొక్కి..

రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దోపిడీ విధానాలను అమలు చేస్తున్నదని జగన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మావోయిస్టు పార్టీ నిర్మూలన కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తున్నదని మండిపడ్డారు. దోపిడీ పాలకులంతా కుమ్మక్కై 2026 మార్చి వరకు డెడ్‌లైన్లు ప్రకటించి అణిచివేత ప్రయోగిస్తున్నారని పేర్కొన్నారు. దోపిడీ పీడనలు ఉన్నంతకాలం విప్లవాలను అణిచివేయడం అసాధ్యమని తేల్చి చెప్పారు. పీఎల్జీఏ వార్షికోత్సవాలను డిసెంబర్ 2 నుంచి 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరపాలని పిలుపునిచ్చారు.

పత్తి రైతుల అవస్థలు

మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని ఎస్ఎస్‌వీ కాటన్‌మిల్లులో మూడు రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు. ఎప్పుడు కొంటారో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- మూసాపేట(అడ్డాకుల)

సీపీఎస్ఈయూ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొలిపాక వెంకటస్వామి

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ తలపడనున్నది. వరంగల్, నల్లగొండ, ఖమ్మం స్థానానికి తమ అభ్యర్థిగా డాక్టర్ కొలిపాక వెంకటస్వామిని ప్రకటించింది. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన్ను తమ అభ్యర్థిగా ఖరారు చేసినట్టు సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ సోమవారం వెల్లడించారు.

జాక్టో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పూల రవీందర్

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) తరపున వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌ను బరిలో దింపనున్నట్టు జాక్టో ప్రకటించింది. సోమవారం బేగంపేట హరితప్లాజాలో జాక్టో చైర్మన్ సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సంఘాల నేతలు పాల్గొని పూల రవీందర్‌ను అభ్యర్థిగా ఖరారు చేశారు.

తాడూరు మండలం ఇంద్రకల్ సమీపంలోని మణికంఠ కాటన్ మిల్‌లో పత్తిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్య